సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం | 11 | ఆగస్టు | 2024



సంరక్షణతో పశు సంపద

ఉదయం లేచింది మొదలు, రాత్రయ్యే వరకూ పాలు, టీ, కాఫీలంటూ తీసుకునే వారెందరో.. అలాంటి పాల ఉత్పత్తులు కావాలంటే పాడి పరిశ్రమ ఎంతో అధారం.


8 లో



అలరించిన బాలోత్సవం

విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు.

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 5,03,702 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 7.90 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 5500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ముస్లింల మనోభావాలను దెబ్బతీయొద్దు



షేక్ అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: వక్ఫ్ బోర్డు ఆస్తుల ద్వారా ముస్లిం సమాజ సంక్షేమం జరుగుతోందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. అలాంటి వక్ఫ్ ఆస్తులపై సవరణ బిల్లు తీసుకురావడం అంటే ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం అమలాపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులంటే తమ ఇష్ట దైవం అల్లాకు సంబంధిన వేనని సెంటిమెంట్‌గా భావిస్తామని చెప్పారు. వక్ఫ్ చట్టాన్ని సవరణ చేయడం కేంద్రంలోని ప్రభుత్వానికి తగదని ధ్వజమెత్తారు. ఎన్డీయే ప్రభుత్వం ఆది నుంచి ముస్లింలను శత్రువులుగా చూస్తోందన్నారు. ముస్లింలకు వక్ఫ్ ఆస్తులు రాజ్యాంగపరంగా సిద్ధించినవేనని, ముస్లింల హక్కులను హరించేలా ఇప్పుడు చట్ట సవరణలు చేయడం అంటే తమ మత స్వేచ్ఛను కాలరాయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఖాదర్ డిమాండ్ చేశారు. లోక్‌సభలో వైఎస్సార్ సీపీ ఎంపీలు సవరణను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంపై ముస్లిం సమాజం హర్షిస్తోందన్నారు. జిల్లాలో దాదాపు 2,100 ఎకరాల భూములను వక్ఫ్ బోర్డు ద్వారా పరిరక్షిస్తుంటే, ఆ హక్కులను కలెక్టర్ల చేతిలో పెట్టడం ఎంత వరకూ సమంజసమని ఖాదర్ ప్రశ్నించారు.

నయనానందం.. బాలాజీ రూపం



స్వామివారి అన్న ప్రసాదం కోసం వేచి ఉన్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాల బాలాజీ స్వామివారి క్షేత్రం నయనానందకంగా మారింది. పవిత్ర శ్రావణ మాసం, రెండో శనివారం సెలవు రోజు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచే వైనతేయ గోదావరి నదీతీరంలోని స్నానఘట్టం, పాత, కొత్త ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. తొలుత స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం బాలాజీ స్వామిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,73,187 ఆదాయం లభించిందని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,03,820, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.69,367 విరాళాలుగా వచ్చిందన్నారు. స్వామివారిని 3,582 మంది దర్శించుకోగా, 2,896 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

లైన్‌మేన్‌లకు పదోన్నతులు కల్పించాలి



పసలపూడిలో డిమాండ్ల సాధనకు నినదిస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు

రాయవరం: జూనియర్ లైన్‌మేన్ గ్రేడ్-2 ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం పసలపూడిలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులను మాతృ సంస్థకు పంపిస్తున్నందున జూనియర్ లైన్‌మేన్ గ్రేడ్-2 ఉద్యోగులను ఏపీఈపీడీసీఎల్‌లో అనుసంధానం చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్లుగా నియమితులైన తమను జూనియర్ లైన్‌మేన్‌లుగా గుర్తించాలన్నారు. 2021 అక్టోబర్ 2 నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన జేఎల్ఎంలను 2022 జూలై 1న ప్రొబేషన్ డిక్లేర్ చేసినందున 9 నెలల సర్వీసును కోల్పోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలల సర్వీసును ప్రొబేషన్ కలపాలని వారు కోరారు. అలాగే ఇతర జిల్లాల్లో, డివిజన్లతో ఉన్న జేఎల్ఎం గ్రేడ్-2లకు కూడా బదిలీలు కల్పించాలని, పదోన్నతి ఛానల్ వర్తింపజేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.తాతాజీ, ఉపాధ్యక్షుడు కె.వీరబాబు, ప్రధాన కార్యదర్శి జి.సూర్యనారాయణ, సలహాదారుడు ఎం.రాము, సభ్యులు పి.సత్యరాజేష్, డి.రాంజీ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ



- ఉచిత ఇసుకంటూ మెలిక పెట్టిన ప్రభుత్వం
- లారీలకు 'వెయిటింగ్' చార్జీల పేరుతో భారం
- కొత్త తరహా దోపిడీకి తెరదీసిన ఇసుకాసురులు
- గతంలో ర్యాంపు నుంచి ఐదు టన్నులు రూ.12,500
- ఇప్పుడు స్టాక్ పాయింట్ల ద్వారా రూ.16 వేలకు పైగా వసూలు

సాక్షి, అమలాపురం/ రావులపాలెం: ఉచితమంటూనే మెలిక పెట్టారు.. అదనపు చార్జీల వసూలుతో వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో లారీలకు 'వెయిటింగ్' చార్జీల పేరుతో భారం మోపుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడే అదనంగా సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. 'అవకాశాలు సృష్టించుకోవాలి.. అలా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలంటూ' ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ చెప్పే మాటలను ఆ పార్టీ నాయకులు అందిపుచ్చుకొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఉచిత ఇసుక పాలసీలో చెల్లించాల్సిన సొమ్ము కన్నా అదనంగా 'బీ- వీ' ట్యాక్స్‌లో వసూలు చేస్తున్న టీడీపీ నేతలకు దన్నుగా కొందరు లారీ డ్రైవర్లు తోడయ్యారు. వెయిటింగ్ చార్జీల పేరుతో నిర్దేశించిన రవాణా చార్జీలకు అదనంగా వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రజలకు మోయలేని భారమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ర్యాంపుల వద్ద ఇసుకకు రుసుం వసూలు చేసిన దానికన్నా కూటమి ప్రభుత్వంలో స్టాక్ పాయింట్ వద్ద నిల్వఉన్న ఇసుక ధర అధికంగా ఉండడం గమనార్హం. ఇందుకు అతి పెద్ద ఉదాహరణ రావులపాలెంలో ఇప్పుడు పలుకుతున్న ఇసుక ధర. గత ప్రభుత్వంలో ఐదు యూనిట్ల ఇసుక (అప్పట్లో 22 టన్నుల వరకూ వచ్చేది) కొనుగోలు చేస్తే, లారీ రవాణా ఖర్చులతో కలిపి రూ.12,500 వరకూ అయ్యేది. అప్పట్లో ఇసుక ర్యాంపు వద్ద టన్ను రూ.475 వరకూ ఉండేది. ఐదు యూనిట్లు (22 టన్నులు) ధర రూ.10,450 వరకూ అయ్యేది. జొన్నాడ, గోపాలపురం ర్యాంపుల నుంచి రావులపాలేనికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకూ రవాణా చార్జీ ఇవ్వాల్సి వచ్చేంది. ఇలా ఐదు యూనిట్ల లారీ ఇసుక వినియోగదారుని వద్దకు చేరే సరికి రూ.12,500కు వచ్చేది. టన్ను రూ.475లోనే ప్రభుత్వానికి రూ.375 వరకూ ఆదాయం రూపంలో వెళ్లేది. ఇది కాకుండా ర్యాంపుల్లో లోడింగ్, బాటల నిర్వహణ, ఇతర ఖర్చులకు రూ.వంద వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక పాలసీల్లో స్టాక్ పాయింట్ వద్ద టన్ను ధర రూ.265గా నిర్ణయించారు. ఇప్పుడు ఐదు యూనిట్లు (గరిష్ఠంగా 20 టన్నులు) ధర రూ.5,300. బీ- వీ ట్యాక్స్ పేరుతో ఇస్తున్న స్లిప్‌లకు వసూలు చేస్తున్న రూ.5,100 కలిపి మొత్తం రూ.10,400 అవుతోంది. స్టాక్ పాయింట్ల వద్ద అనధికార ట్యాక్స్ వసూలు చేస్తున్న టీడీపీ తృతీయ శ్రేణి నాయకులు దీనికి అదనంగా రూ.వెయ్యి చార్జీ చేస్తున్నారు. మొత్తం అంతా కలిపి రూ.11,400 వరకూ అవుతోంది. ఇక రవాణా చార్జీ లారీకి ఏకంగా రూ.4 వేల నుంచి రూ.4,600 వరకూ తీసుకుంటున్నారు. ఇలా మొత్తం అంతా కలిపి రూ.16 వేలు అవుతోంది. ఇందులో కూడా రెండు టన్నుల ఇసుక తక్కువగా వస్తుండడం గమనార్హం.

అదనపు భారం వేస్తూ..

గత ప్రభుత్వంలో ర్యాంపుల వద్ద వసూలు చేసిన సొమ్ములో మూడో వంతు అంటే సుమారు 78 శాతం ప్రభుత్వానికి ఆదాయం రూపంలో వెళ్లేది. ఇప్పుడు ప్రభుత్వం వసూలు చేస్తున్న రూ.265లో చాలా కొంత మొత్తం మాత్రమే సీనరేజ్, జీఎస్టీగా వసూలు చేస్తున్నారు. ఇందులో సీజరేజ్‌గా వసూలు చేసే ఆదాయం రూ.88ని జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇక జీఎస్టీగా 18 శాతం ఆదాయం మాత్రమే ప్రభుత్వానికి వస్తోంది. ఈ విధానంతో వినియోగదారులపై భారం పడుతుంది.

మిగతా చోట్లా ఇంతే..

రావులపాలెంలోనే కాదు జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇసుక ధర గతం కన్నా అధికంగా ఉంది. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామం సముద్రతీర ప్రాంతం. ఇక్కడకు ఐదు యూనిట్ల ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.19 వేల నుంచి రూ.21 వేల వరకూ అయ్యేది. ఇప్పుడు రూ.23 వేల నుంచి రూ.25 వేల వరకూ అవుతుండడం గమనార్హం. అంతమాత్రాన ఇసుక అడిగిన వెంటనే దొరకడం లేదు. రవాణా చార్జీలపై అదుపు లేకపోవడంతో స్టాక్ పాయింట్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాలకు ఇసుక రవాణా చేసేందుకు లారీల యజమానులు మక్కువ చూపుతున్నారు. దీనివల్ల రోజులో కనీసం రెండు, మూడు ట్రిప్పులు వేసే అవకాశముంది. అదే దూర ప్రాంతమైతే ఒక ట్రిప్పు వేసే అవకాశం ఉండడం వల్ల రాబడి తక్కువగా ఉందని లారీల యజమానులు దూరానికి రవాణా పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

ఇ'దందా' వెయిటింగ్ వల్లే..

జిల్లాలో రావులపాలెంలో రెండు, మందపల్లి, కపిలేశ్వరపురం స్టాక్ పాయింట్ల వద్ద నుంచి ఇసుక ఎగుమతి అవుతోంది. ఇక్కడ ఇసుకకు అదనపు వసూలు చేయడమే కాకుండా ఎంపిక చేసిన లారీలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో మిగిలిన లారీల నిర్వాహకులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఒక్కోసారి రోజంతా లైన్‌లో నిలబడాల్సి వస్తోంది. దీంతో లారీల యజమానులు వెయిటింగ్ భారాన్ని వినియోదారులపై వేస్తున్నారు. లారీలు వెయిటింగ్‌లో ఉండడం వల్ల డ్రైవర్లకు అదనపు బేటాలు చెల్లించాల్సి రావడంతోపాటు అదనపు చార్జీలు వసూలు చేయడం వినియోగదారులకు ఇబ్బందిగా మారింది.



రావులపాలెం స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరిన లారీలు

కొత్త ప్రభుత్వం చేసేదేంటో చెప్పాలి

యూటీఎఫ్ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు



యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అమలాపురం టౌన్: కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం శాఖల వారీగా విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో గత ప్రభుత్వంపై విమర్శలే తప్ప అధికారంలోకి వచ్చిన తాము ఏం చేస్తామో చెప్పలేదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సభకు ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దీనికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఐవీ వెంకటేశ్వరరావు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఉద్యమ పితామహుల చిత్రపటాలకు ఎమ్మెల్సీలు, యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ 50 ఏళ్లలో సాధించిన విద్యా విజయాలను వివరించారు. స్వర్ణోత్సవ సంబరాలు పాటల సీడీని ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెబుతూ వారి త్యాగాలను కొనియాడారు. మధ్యాహ్నం నుంచి జరిగిన విద్యా సదస్సులో యూటీఎఫ్ పూర్వపు అధ్యక్షుడు జోజయ్య యూనియన్ 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను వివరించారు. యూటీఎఫ్ ద్వారా ఉపాధ్యాయులు చేసిన సేవలు, సామాజిక బాధ్యతలు గొప్పవన్నారు. 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భవించి నేటికి యాభై ఏళ్లు పూర్తి చేసుకుందని, ఉపాధ్యాయులంతా అదే స్ఫూర్తితో పనిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

దాడికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి

మాజీ ఎంపీ చింతా అనురాధ



సాక్షి, అమలాపురం: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రసంగాలతో ఊదరగొడుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడికి ఎటువంటి సమాధానం చెబుతారని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ ప్రశ్నించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషమన్నారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచిన గత ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని ఆమె గుర్తు చేశారు. అలాగే 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగ నిర్మాత పట్ల తన గౌరవ మర్యాదలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాటారన్నారు. ఆయనపై కక్షతో విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించడం అన్యాయమన్నారు.

స్మృతివనంపై దాడి అమానుషం



పి.గన్నవరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులు



ద్రాక్షారామలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పిల్లి సూర్యప్రకాశ్, ఎస్సీ, బీసీ నాయకులు

- అంబేడ్కర్ విగ్రహానికి అవమానంపై నిరసనలు
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

సాక్షి, అమలాపురం: విజయవాడ నడిబొడ్డున దేశం గర్వించదగ్గ స్థాయిలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంపై అప్రజాస్వామికంగా దాడికి తెగబడిన వారిని అరెస్ట్ చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దేశాన్ని అగౌరవపరిచేలా టీడీపీ నాయకులు వ్యవహరించారంటూ దళిత నాయకులు మండిపడ్డారు. సోమవారం జిల్లాలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడాన్ని, మాజీ సీఎం జగన్ పేరున శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని వారు తప్పు పట్టారు. కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు హోరెత్తించారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై విధ్వంసకాండకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పి.గన్నవరం సెంటర్లో రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ కొత్తపేటలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వ విధానాలను ఖండించారు. ఈ ఆందోళనకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలి వచ్చారు. అంబేడ్కర్ స్మృతివనంపై అప్రజాస్వామికంగా దాడికి తెగబడిన వారిని అరెస్ట్ చేయాలని కోరుతూ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ద్రాక్షారామలో నిరసన తెలిపారు. అక్కడి యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లు సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఇందులో భాగంగా విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియాలు ఏర్పాటు చేశారన్నారు. దీనిపై అక్కసుతో దాడి చేయడం దారుణమన్నారు.

సత్యదేవుని దర్శనానికి ఆంక్షలు

- మధ్యాహ్నం 3 తరువాతే ప్రదక్షిణ దర్శనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు
- రూ.300 టికెట్‌తో నిత్యం రూ.3 లక్షల ఆదాయం
- ఆదాయానికి గండి పడుతున్నా చర్యలు శూన్యం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రదక్షిణ ఓ ప్రహసనంలా మారింది. భక్తుల రద్దీని నియంత్రించే పేరుతో మధ్యాహ్నం మూడు గంటల తరువాత మాత్రమే ప్రదక్షిణ దర్శనానికి అనుమతిస్తున్నారు. రూ.300 టిక్కెట్‌తో రెండు నెలల క్రితం వరకు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించేవారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రోజుకు రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రతి నెలా రూ.80 లక్షల నుంచి రూ. కోటి వరకు ఈ దర్శనం టిక్కెట్ల ద్వారా వచ్చేది. ప్రస్తుతం ఈ ప్రదక్షిణ దర్శనంపై ఆంక్షలతో ఆ ఆదాయానికి భారీగా గండి పడింది.

> **దీనిపై పరిశీలిస్తాం**
>
> గతంలో ఉన్న విధంగా ఉదయం నుంచి రాత్రి వరకు సత్యదేవుని ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించే విషయమై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
>
> – ఇన్‌ఛార్జి ఈఓ. రమేష్ బాబు

ప్రస్తుతం అంతరాలయం దర్శనం పేరుతో రూ.200 టిక్కెట్ మీద లోపలకు పంపుతున్నా భక్తులు సంతృప్తి చెందడం లేదు. గతంలో రూ.300 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనం చేసుకునే భక్తుల్లో ఇప్పుడు సగం మంది కూడా రూ.200 టిక్కెట్‌తో అంతరాలయం దర్శనం చేసుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఉచిత దర్శనానికి అంతరాలయం దర్శనానికి పెద్ద తేడా లేకపోవడమే.

కాగా, రెండు నెలల క్రితం ఆలయానికి వచ్చి రూ.300 టిక్కెట్లు తో గర్భాలయం చుట్టూ ప్రదక్షిణ దర్శనం చేసుకున్న భక్తులు ఇప్పుడు మళ్లీ ఆలయానికి వచ్చినపుడు ప్రదక్షిణ దర్శనం ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆంక్షల వల్ల ఆదాయం కోల్పోతున్న విషయం తెలిసినా అధికారుల మీద భయంతో ఎవరూ నోరు మెదపడం లేదు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

గత ఏడాది విజయదశమి నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ దర్శనం

గత ఏడాది విజయదశమి నుంచి సత్యదేవుని ఆలయంలో గర్భాలయ దర్శనం ప్రారంభమైంది. అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఈ దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ఆయన కోరిక మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త, దానవాయిపేటకు చెందిన హేచరీస్ అధినేత చినబాబు రూ.25 లక్షల వ్యయంతో ప్రదక్షిణ దర్శనం మార్గంలో నాలుగు దిక్కులా బంగారు పూత కలిగిన శ్రీగంధం గిన్నె, లక్ష్మీ హుండీ, కల్పవృక్షం, కామధేనువులను ఏర్పాటు చేశారు. భక్తులు వీటిని దర్శిస్తూ ప్రదక్షిణగా స్వామివారి అంతరాలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకునే వీలు కల్పించారు. ప్రస్తుతం ఈ దర్శనాలు నిలిపివేయడంతో అవి ఏర్పాటు చేసిన దాతల ఆశయం నెరవేరడం లేదు. దానికి తోడు ప్రదక్షిణ దర్శనం మార్గంలో ఏసీలు, ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేయడంతో ఎంతసేపు ఆలయంలో ఉన్నా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండడంతో ఈ దర్శనానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

భక్తులు ఎవరూ లేని సమయంలో అనుమతి

సాధారణంగా సత్యదేవుని ఆలయంలో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటారు. ఆ తరువాత భక్తులు పెద్దగా ఉండరు. కానీ ప్రదక్షిణ దర్శనానికి మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మాత్రమే భక్తులను అనుమతించాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. కార్తీకమాసం, దశమి, ఏకాదశి, శనివారం వంటి రోజుల్లోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉంటారు. అయితే ఆ రోజుల్లో అసలు ప్రత్యేక దర్శనానికి అనుమతి ఇవ్వడం లేదు. దీంతో భక్తుల అసంతృప్తితో బాటు దేవుని ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించాలని కోరుతున్నారు.









ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన గంధపు గిన్నె, లక్ష్మీదేవి హుండీ, కామధేనువు, కల్పవృక్షం

క్లుప్తంగా

రేపటి నుంచి 11 జిల్లాల అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ, ఏలూరు జిల్లాలో జిల్లా స్థాయి అధికారులకు 5వ బ్యాచ్ శిక్షణ ఉంటుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 9 లక్ష్యాలపై అవగాహన ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌కు ఒక అంశంపై శిక్షణ అందిస్తున్నామని అన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకూ మూడు రోజుల పాటు 'మహిళా స్నేహపూర్వక గ్రామం' అనే అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. మూడు రోజులు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఐ.పోలవరం మండలం ఎదుర్లంకకు చెందిన లారీ డ్రైవర్ పితాని రామకృష్ణ (42) ఈ నెల 7న మోటారు సైకిల్‌పై అమలాపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ముమ్మిడివరం కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. రామకృష్ణకు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఏఎస్సై పెద్దబ్బాయి మృతి



ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న పి.పెద్దబ్బాయి (60) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. రాజవొమ్మంగి మండలం లాగరాయికి చెందిన పెద్దబ్బాయి ఏలేశ్వరంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం అస్వస్థతకు గురికాగా కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గుండెపోటుతో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జిల్లా పోలీస్ యూనియన్ అధ్యక్షుడు పి.సత్యమూర్తి, అసోసియేషన్ సభ్యులు, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై ఎం.పవన్‌కుమార్‌లు సంతాపం తెలిపారు.

సంరక్షణతో పశు సంపద

- పెంపకంలో జాగ్రత్తలు అవసరం
- తద్వారా అధిక ఆదాయం

కొత్తపేట: ఉదయం లేచింది మొదలు, రాత్రయ్యే వరకూ పాలు, టీ, కాఫీలంటూ తీసుకునే వారెందరో.. అలాంటి పాల ఉత్పత్తులు కావాలంటే పాడి పరిశ్రమ ఎంతో ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పాడి పరిశ్రమ ఎందరో రైతులకు జీవనోధారం అయ్యింది. ఒకపక్క వ్యవసాయంతో పాటు అనుబంధంగా పశు సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించేవారు. కాలక్రమేణా నిర్వహణ భారమై పశు పోషణ తగ్గించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆయా రంగాల వైపు రైతులను మళ్లించేందుకు ప్రోత్సాహక పథకాలు అమలు చేసింది. ప్రధానంగా పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ప్రోత్సహించింది. దానితో పాడి రైతుల్లో పరిశ్రమ పట్ల ఆసక్తి పెరిగింది. దానికనుగుణంగానే ప్రస్తుతం పాల ఉత్పత్తులకు డిమాండ్ బాగా పెరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పశువులు 1,60,403 గేదెలు, 75,839 ఆవులు పెంచుతున్నారు. జిల్లాలో పాల సేకరణ కేంద్రాలు 139, బల్క్‌మిల్క్ సెంటర్లు 5 ఉన్నాయి. నిత్యం 7,797 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. పశువుల సంరక్షణ ద్వారా అధిక పాల ఉత్పత్తి, పాలు తీసే సమయంలో మెళకువలు, వాటిని కేంద్రాలకు, వినియోగదారులకు తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తద్వారా ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, రావులపాలెం ప్రాంతీయ పశువైద్యాధికారి ఎస్.మహేశ్వరరెడ్డి వివరించారు.



గేదె నుంచి పాలు తీస్తున్న పాడి రైతు

సంరక్షణ.. జాగ్రత్తలు

- నిత్యం పాడి పశువులకు పచ్చి, ఎండు గడ్డితో పాటు పోషకాలతో కూడిన దాణా అందించాలి. తగినంత నీరు తాగించాలి.
- పశువులకు దోమలు కుట్టకుండా సంరక్షించాలి. సౌకర్యవంతంగా పశు శాలను ఏర్పాటు చేయాలి.
- గేదె ఈనిన 15 రోజుల వరకూ పాల కేంద్రాలకు పాలను వేయరాదు. జున్ను పాలు కలిస్తే మంచి పాలు కూడా పాడైపోతాయి.
- పాలు తీయడానికి ముందు నేలను ఊడ్చి నీటితో కడగాలి. చుట్టుపక్కల బురద, పేడ కుప్పలు ఉండరాదు.
- పాలు తీసే ముందు పాడి పశువును గోరువెచ్చని నీటితో కడగాలి. పొదుగును శుభ్రం చేయాలి. అలా కుదరకపోతే పొదుగును కడిగి పొడి వస్త్రంతో తుడవాలి.
- పాలు తీసే వ్యక్తి చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తడి చేతులతో పాలు పితకరాదు.
- ముందు తీసిన పాలలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి, వెన్న శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు పాలను దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.
- పాలు వేయడానికి స్టీలు, అల్యూమినియం పాత్రలనే వాడాలి.
- నీళ్లు కలపడం వల్ల పాలలో వెన్న శాతంతో పాటు మిగిలిన ఘన పదార్థాలు తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది.
- పాలు చుట్టుపక్కల వాసనను వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపలు, మురుగు నీటి వాసన వస్తే పాలు ఆ వాసనను గ్రహించి పులిసిన వాసన వస్తుంది. పాలు పితికిన వెంటనే శుభ్రమైన వస్త్రంతో వడకట్టాలి.
- రాత్రి తీసిన పాలతో తర్వాత తీసినవి కలపకూడదు. తాజా పాలు కొంచెం తియ్యని వాసన కలిగి ఉంటాయి.
- పాలల్లో ఎరుపు జీర, తరకలు కనిపిస్తే పశువుల్లో పొదుగు వాపు గాని, గాయం గాని ఉండి ఉండవచ్చు. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి. పై నియమాలు పాటిస్తే లాభాలు పొందవచ్చు.

ఇదే జీవనాధారం



నాకు 10 పాడి గేదెలు ఉన్నాయి. ఇందులో 4 చూడివి కాగా, 6 పాలిచ్చే గేదెలు. పూటకు సుమారు 30 లీటర్ల పాల దిగుబడి రాగా, నాకు పాల సేకరణ కేంద్రం కూడా ఉంది. దీనిద్వారా పాడి రైతుల నుంచి 50 లీటర్లు సేకరించి రిటైల్‌గా వినియోగదారులకు విక్రయిస్తున్నాను. ఈ విధంగా పాల ఉత్పత్తి, పాల సేకరణ ద్వారా జీవనం సాగిస్తున్నాను.

–చోడపనీడి వీవీ సత్యనారాయణ, పాడి రైతు, వాడపాలెం, కొత్తపేట మండలం

శుభ్రంగా ఉంచాలి



పశువుల శాలలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ముఖ్యంగా పశువులు వదిలిన మూత్రం అక్కడే నిల్వ ఉండకుండా పల్లానికి వెళ్లేలా శాలలో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలి. పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన అధిక పాల ఉత్పత్తి సాధించడంతో పాటు మంచి వెన్న శాతం వస్తుంది. తద్వారా లాభాలు పొందవచ్చు.

–ఎస్.మహేశ్వరరెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ, వైద్యాధికారి, ప్రాంతీయ పశు వైద్యశాల, రావులపాలెం

అతివేగం.. ఆపై నిర్లక్ష్యం

- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- పది మందికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన మహిళలు

అంబాజీపేట: అతివేగం.. ఆపై నిర్లక్ష్యంగా ఆర్టీసీ బస్సును నడిపి ఓ ఆటోను బలంగా ఢీకొనడంతో అందులో ప్రయాణికులు పది మంది గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం నుంచి పది మంది మహిళలు పాసింజర్ ఆటోలో ముంగండ వద్ద రొయ్యల పరిశ్రమలో పని నిమిత్తం బయలుదేరారు. వీరి ఆటో అంబాజీపేట నాలుగు రోడ్ల కూడలికి వచ్చేసరికి రావులపాలెం నుంచి వయా స్టీల ఆస్పత్రి మీదుగా అమలాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా దూసుకువచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బెండమూరిలంకకు చెందిన బొంతు లక్ష్మీరాధిక, మట్టపర్తి వరలక్ష్మి, వాసర్ల పద్మ, బొంతు దుర్గ, గోడితిప్పకు చెందిన కొల్లి లక్ష్మి, సరెళ్ల అనంతలక్ష్మి, బొంతు సత్యవతి, పిల్లా దేవి, సరెళ్ల దేవి, దేవగుప్తానికి చెందిన ఆటో డ్రైవర్ యు.నాగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక మహిళ స్వల్ప గాయాలతో బయటపడింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా నాలుగు స్థానిక రోడ్ల సెంటర్‌లో రాజోలు, అమలాపురం ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులు అతివేగంగా వెళుతున్నాయని, వీటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కిక్కిరిసిన శృంగార వల్లభుని ఆలయం

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. శనివారం కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వివిధ సేవలు, టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా రూ. 2,97,678 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 18 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా, నాలుగు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

తిరుపతిలో శృంగార వల్లభస్వామి →




స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

భజే శ్రీనివాసా.. శ్రీవేంకటేశా


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

- వాడపల్లికి శ్రావణ శోభ
- భారీగా భక్తజనం రాక


ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఆత్రేయపురం: ఆ చిద్విలాసుని క్షేత్రం భక్తజనంతో మురిసింది.. గంట గంటకూ కోలాహలంగా మారింది.. శ్రావణ మాసం, ఆపై రెండో శనివారం విద్యార్థులకు సెలవుదినం కావడంతో కిక్కిరిసింది. గోవింద.. హరి గోవింద నామస్మరణతో భక్తజనం ప్రదక్షిణ చేస్తుండగా, మరింత మంది తోడవడంతో ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి క్షేత్రం మొదటి శ్రావణ శనివారం పురస్కరించుకుని రద్దీగా మారింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో వేద పండితులు, అర్చకులు అలంకరించారు. సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అలాగే వివిధ ప్రాంతాల ప్రజలు కాలినడకన స్వామి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తుల రాక మొదలైంది. క్యూలో బారులు తీరారు. అయితే ఉదయం 9 గంటల సమయంలో వర్షం వచ్చినా దానికి లెక్క చేయకుండా ప్రదక్షిణలు చేశారు. దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన బాలోత్సవం


బాలోత్సవంలో బాలికల నృత్య ప్రదర్శన

కొత్తపేట: విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కోనసీమ బాలోత్సవం మొదటి పిల్లల పండుగ పేరిట రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. మనం ట్రస్ట్, జితేంద్ర సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యనారాయణ, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించేది పాఠశాలలేనని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నానుడితో కోనసీమ బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నప్పటి నుంచే విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటల్లో ఆసక్తి కలిగించాలని, తద్వారా వారిలో నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విచిత్ర వేషధారణ, కోలాటాలు, నాట్య ప్రదర్శనలు, లఘు నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్రకుమార్, కోనసీమ బాలోత్సవ అధ్యక్షుడు కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఇన్‌చార్జి యండూరి పవన్, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబులను అభినందించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్, మందపల్లి మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణ మోహన్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మత్తు మందు ఇచ్చి చోరీ

కాకినాడ క్రైం: కాకినాడ గాంధీనగర్‌లో వృద్ధురాలు ఓ మహిళ చేతిలో మోసానికి గురైంది. పెద్దమ్మగారు అంటూ పంచన చేరిన ఆ మహిళ జ్యూస్‌లో మత్తు మందు కలిపి వృద్ధురాలికి ఇచ్చి బంగారంతో ఉడాయించింది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన వంగా మణి (79) ఇంట్లో ఒంటరిగా జీవిస్తుంది. ఆ విషయాన్ని గమనించిన ఓ మహిళ కొద్ది రోజులుగా మీ పొరుగునే ఉంటున్నానంటూ మాట కలిపింది. చేదోడువాదోడుగా ఉంటుండడంతో మణి ఆమెను నమ్మింది. ఈ క్రమంలో గత నెల 24న ఉదయం పెద్దమ్మగారు మీరు చాలా నీరసంగా ఉన్నారంటూ అభిమానం కురిపించి వృద్ధురాలి ఇంట్లో ఉన్న బీట్‌రూట్‌తో జ్యూస్ చేసి ఇచ్చింది. ఆ జ్యూస్‌లో మత్తు మందు కలిపి మణితో తాగించింది. ఆమె మత్తులోకి జారిన తర్వాత ఇంట్లో ఉన్న 64 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లిపోయింది. మూడు రోజుల పాటు ఆ వృద్ధురాలు మత్తులోనే ఉంది. మూడు రోజుల తరువాత 27న లేచి చూసే సరికి ఆ మహిళ ఇచ్చిన జ్యూస్, అది తాగిన తర్వాత మత్తులోకి వెళ్లానన్న విషయం గుర్తొచ్చింది. కంగారుగా బీరువా వెతికేసరికి అందులో ఉన్న బంగారం చోరీకి గురైందన్న విషయం గుర్తించింది. ఇప్పటివరకూ ఆమె కోసం గాలించినా ఫలితంలేక పోలీసులను ఆశ్రయించింది.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ


ప్రయాణికుడికి పోగొట్టుకున్న గొలుసును అందిస్తున్న కండక్టర్, అధికారులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న రెండు కాసుల బంగారు గొలుసును అతనికి అందించి ఓ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాజులూరు మండలం అంద్రంగికి చెందిన మాచవరపు కృష్ణ కుటుంబ సభ్యులతో కలసి పాలకొల్లు వెళ్లడానికి అమలాపురం బస్టాండ్‌కు శుక్రవారం వచ్చారు. అతని రెండు కాసుల బంగారు గొలుసు బస్టాండ్‌లో పడిపోయింది. ఆ గొలుసు అమలాపురం డిపో కండక్టర్ పి.నారాయణరావుకు దొరికింది. దానిని డిపో అధికారులకు అప్పగించారు. గొలుసును పోగొట్టుకున్న ప్రయాణికుడు అమలాపురం బస్టాండ్‌లోని విచారణ కేంద్రం వద్ద సంప్రదించగా శనివారం ఆ గొలుసును సెక్యూరిటీ అధికారి, సీఐ పతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎస్.వరహాలుబాబు సమక్షంలో కండక్టర్ నారాయణరావు ప్రయాణికుడు కృష్ణకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి అభినందించారు.

వెనుక బడి.. ఎదురుగా గుడి

- కూటమి ప్రోద్బలంతో తెరుచుకున్న పేకాట క్లబ్
- పోలీసుల దాడి.. టీడీపీ నేతల పైరవీలు

అమలాపురం టౌన్: కొన్నేళ్లుగా మూతపడిన అమలాపురం జార్జి రిక్రియేషన్ క్లబ్ కూటమి నేతల ప్రోద్బలంతో మళ్లీ తెరుచుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కూడా కొందరు నేతలకు వత్తాసు పలకడంతో క్లబ్ శుక్రవారం రాత్రి తెరుచుకునే ఏర్పాట్లు జరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేకాట క్లబ్‌లకు ఎంత మాత్రం అవకాశం లేకపోవడంతో అవి మూతపడ్డాయి. అయితే శనివారం ఆ క్లబ్‌లో పేకాట ఆడుతున్న సమయంలో పోలీసులు మెరుపు దాడి చేశారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే టీడీపీ నేతలు కొందరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు నమోదుకు ససేమిరా అంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. శనివారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకూ కొందరు నేతలు పట్టణ పోలీస్ స్టేషన్ వద్దే ఉండి పోలీసులతో మంతనాలు జరిపారు. నేతల ఒత్తిడి, పైరవీలతో కేసు నమోదు చేస్తారా.. లేదా అనే సందేహాలు ప్రజల్లో నెలకొంది. ప్రజాప్రతినిధి ఇచ్చిన అభయమే అనధికార అనుమతిగా భావించి కొందరు కూటమి నేతలు క్లబ్ తెరిచి బరి తెగించి మరీ పేకాటకు తెర తీశారు.


అమలాపురంలో మళ్లీ తెరుచుకున్న జార్జి రిక్రియేషన్ క్లబ్ భవనం ఇదే..

అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేది లేదని జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రకటనలతో ఊదరకొడుతుంటే ఈ పేకాట క్లబ్‌కు ఎలా అనుమతి ఇచ్చారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దాడి చేసిన పోలీసులు పేకాటపై కేసు నమోదు చేస్తే సరేసరి. లేని పక్షంలో పోలీసులు కూటమి నేతల ఒత్తిళ్లకు గురయ్యారనే అనుమానాలు బలపడతాయి. ఈ క్లబ్ భవనం వెనుకే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఎదురుగా వినాయక గుడి ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు గుడి, బడి నిబంధనలు వర్తిస్తాయి. ఆ నిబంధనలను కూటమి నేతలు తుంగలో తొక్కి మరీ క్లబ్ తెరవడంపై విమర్శలకు దారి తీస్తోంది. ఏదేమైనా ఇది ఎంతవరకూ వెళ్తుందో వేచి చూడాల్సిందే.